క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆషాఢమాసం ప్రారంభం మొదటి శనివారం సందర్భంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆయా పూజారి పెంచలయ్య స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. జూలై 5వ తేదీ స్వాతినక్షత్రం స్వామివారి జన్మనక్షత్రం కావడంతో శనివారం ఆషాఢమాసం స్వాతినక్షత్రం రావడం అనేది అరుదుగా వస్తుందని, అలా వచ్చిన రోజున స్వామివారి అభిషేకం దర్శనం చేసుకుంటే అన్ని దోషాలు పోతాయని పూజారి పెంచలయ్యస్వామి తెలిపారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : కొర్రపాడు రోడ్డులోని కేసీ పుల్లయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. కేసీ పుల్లయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో హోలిస్టిక్ ఆస్పత్రి సహకారంతో కార్డియాలజిస్ట్ రాజశేఖరవర్మ, బీఎల్ఎన్ రెడ్డి, ఆర్థో వైద్యుడు హరీష్ బాబు, జనరల్ మెడిసిన్ వైద్యుడు నాగశేఖర్‌రెడ్డి రోగులకు వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు, ఈసీజీ చేయడంతోపాటు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేసీ పుల్లయ్య ఫౌండేషన్ ప్రతినిధి చలపతి, హోలిస్టిక్ హాస్పిటల్ ప్రతినిధి నరసింహా తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి వినతి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

ప్రొద్దుటూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ గాంధీ పార్కులోని మహాత్మాగాంధీ విగ్రహానికి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల శనివారం వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు మాట్లాడుతూ ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని, చెప్పులు, సబ్బులు, కొబ్బరినూనె, యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిస్క్ అలవెన్స్, సామగ్రి అందించాలని, డ్యూటీలో కార్మికుడి సాధారణ మరణమైతే రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు జరిగితే రూ.7 లక్షలు ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, దహన సంస్కారాలకు రూ.25 వేలు ఇవ్వాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్‌రెడ్డి, భాస్కర్, వెంకటేశ్, శివన్న, బాలాజీ, జాషువా, బాబు, కిరణ్, విజయ్‌కుమార్, ప్రమీలమ్మ, అన్నపూర్ణ, రమాదేవి, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రామకృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

అట్లూరు : అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డిని శనివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పరామర్శించారు. అట్లూరు జడ్పీటీసీ సభ్యురాలు అందూరు నరసమ్మ భర్త వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి ఇటీవల ఆరోగ్యం బాగాలేక హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నాడు. బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఉద్యానశాఖ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, బద్వేలు మండల జడ్పీటీసీ సభ్యుడు చిన్నపోలిరెడ్డి, జిల్లా వలంటరీ విభాగ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయినారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చెన్నకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, పుత్తా శ్రీరాములు, నాగసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'కాసు'క్కూర్చున్నారు..!

- బద్వేలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రైటర్ల దందా
- లో ఫీజు– బయటి ఫీజు పేరుతో దోపిడీ
- ప్రతి డాక్యుమెంటుకు భారీగా వసూలు
- బెంబేలెత్తుతున్న కొనుగోలుదారులు



బద్వేలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బద్వేలు : బద్వేలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ల దందా యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వం డాక్యుమెంట్ రైటర్ల వ్యవస్థను రద్దు చేసినా.. వీరి హవా మాత్రం తగ్గడం లేదు. వీరి హస్తం లేనిదే ఏ ఒక్క డాక్యుమెంట్ కూడా.. సబ్ రిజిస్ట్రార్ టేబుల్ పైకి చేరడం లేదు. వీరంతా సిండికేట్‌గా మారి ఒక్కొక్క రిజిస్ట్రేషన్‌కు ఒక్కో రేటు ఫిక్స్ చేసేశారు. కార్యాలయ అధికారులు, రైటర్లు మధ్య కుదిరిన రహస్య ఒప్పందంతో.. లో ఫీజు– బయటి ఫీజు పేరుతో కొనుగోలుదారుల నుంచి దండుకుంటున్నారు. దీంతో వారు లబోదిబోమంటున్నారు.

ప్రశ్నిస్తే కొర్రీ వేస్తారేమోనని..

పోరుమామిళ్ల పట్టణానికి చెందిన ఓ వ్యక్తి 10 సెంట్ల స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు బద్వేలు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి ఓ రైటర్‌ను సంప్రదించారు. రిజిస్ట్రేషన్‌కు కావాల్సినవన్నీ ఉన్నాయి. రిజిస్ట్రేషన్ ఖర్చు రూ.20 వేలు అవుతుందనుకుంటే లో ఫీజు(సబ్ రిజిస్టర్) పేరుతో ఏకంగా రూ.50 వేలు డిమాండ్ చేయడమే కాకుండా రైటర్ ఫీజు కింద మరో రూ.3 వేలు అడగడంతో ఆయన అవాక్కయ్యాడు. ప్రశ్నిస్తే ఏదో ఒక కొర్రీ వేసి రిజిస్ట్రేషన్‌కు ఆటకం కలిగిస్తారేమోనని భావించి.. అడిగినంత ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కలసపాడు చెందిన ఓ వ్యక్తి తన తండ్రి పేరిట ఉన్న స్థలాన్ని తనతోపాటు తన సోదరుడి పేరుతో రిజిస్టర్ చేయించుకునేందుకు సంప్రదించాడు. ఆ రైటర్ తానేమి తక్కువా అన్నట్లు రూ.35 వేల వరకు డిమాండ్ చేశాడు. ఇలా బద్వేలు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నిత్యం జరుగుతున్న దస్తావేజు లేఖరుల దోపిడీ పర్వం కొనసాగుతోందని ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో అటు రైటర్లు.. ఇటు కార్యాలయ అధికారుల అవినీతి, అక్రమాలు పెచ్చుమీరిపోతున్నాయి. అంతేగాకుండా రైటర్లు ఉండే గదులకు అద్దె పేరిట మరికొంత సొమ్ము దోచుకుంటున్నారు. ఇలా ఒక్కో గ్రూపు రోజులో రూ.50 వేల నుంచి లక్ష వరకు వెనకేసుకుంటున్నట్లు క్రయవిక్రయదారుల ద్వారా తెలుస్తోంది.

రోజూ 10 నుంచి 20 దాకా రిజిస్ట్రేషన్లు

వైఎస్ఆర్ కడప జిల్లాలో కడప, ప్రొద్దుటూరు తరువాత అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరిగే ప్రాంతం బద్వేలు. ఇక్కడ క్రయవిక్రయాలు జోరుగా సాగుతుంటాయి. 10 నుంచి 20 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. రిజిస్ట్రేషన్ సమయంలో ఏ చిన్న తప్పు దొర్లినా.. వాటిని సాకుగా చూపి క్రయవిక్రయదారులను భయపెట్టే కార్యక్రమానికి ముందుగా శ్రీకారం చుడతారు. రిజిస్ట్రేషన్ ఆగిపోతే అమ్మిన వారి నుంచి ఎటువంటి ఇబ్బందులు వస్తాయోనన్న భయంతో వారు అడిగిన సొమ్మును ముట్టచెబుతున్నామని విక్రయదారులు చెబుతున్నారు.

రూ.3,000 డిమాండ్

కార్యాలయ అధికారుల పేరు చెప్పుకొని దండుకోవడమే కాకుండా.. రిజిస్ట్రేషన్ స్టాంపులను సిద్ధం చేసినందుకు ఒక్కో రిజిస్ట్రేషన్ నుంచి మరో రూ.3 వేల వరకూ డిమాండ్ చేస్తున్నట్లు కొనుగోలు దారుల ద్వారా తెలుస్తోంది. గతంలో దస్తావేజులు రాసినందుకు రూ.500 నుంచి రూ.1,000 తీసుకునేవారు. అయితే దస్తావేజులు తయారు చేసేందుకు గదులకు అద్దె చెల్లించాలంటూ మరింత అదనంగా వసూలు చేస్తున్నట్లు సమాచారం.

అక్రమ వసూళ్లు

రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయానికి వచ్చిన వెంటనే రైటర్ల నుంచి మొదట వచ్చే పదం లోఫీజ్. అదే సబ్ రిజిస్టర్ ఫీజ్ అనమాట. లో ఫీజ్ సెంటు లెక్కన ఒక రేటు, ఎకరాల చొప్పున మరో రేటు వసూళ్లు చేస్తుంటారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వారు తెచ్చిన కాగితాల్లో ఏమైనా పొరపాటు ఉంటే అంతకు మూడింతలు డిమాండ్ చేయడం రైటర్లకు పరిపాటిగా మారింది. ఒక సెంటుకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకూ, ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకూ దండుకుంటున్నట్లు తెలుస్తోంది.

కూటమి ప్రభుత్వం చర్యలేవి?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై దృష్టి పెట్టడం లేదు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో బద్వేలు రిజిస్ట్రేషన్ కార్యాలయంపై మూడు, నాలుగు సార్లు ఏసీబీ అధికారులు దృష్టి పెట్టి అవినీతి అధికారులపై చర్యలు తీసుకున్నారు. కొందరిని ఇక్కడి నుంచి బదిలీ కూడా చేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంత వరకూ ఒక్కసారి కూడా బద్వేలు రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీ చేయలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు బద్వేలు రిజిస్ట్రేషన్ కార్యాలయంపై దృష్టి పెట్టి అవినీతిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు



నేను ఇక్కడికి బదిలీపై వచ్చి 9 నెలలు అయింది. అప్పటి నుంచి ఎటువంటి అక్రమాలు జరుగలేదు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారి నుంచి రైటర్లు, కార్యాలయ సిబ్బంది అదనంగా వసూలు చేస్తే నేరుగా నాకు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటా.

– ఎస్.విద్యాసాగర్‌రెడ్డి, సబ్‌రిజిస్ట్రార్, బద్వేలు

సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక లేపాక్షి డిగ్రీ కళాశాల విద్యార్థులు డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. నాలుగో సెమిస్టర్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో మల్లేశ్వరి 9.8, సుదీప్తి 9.35, షాహిన్ 9.40, దస్తగిరి 9.40, బీకాం కంప్యూటర్ విభాగంలో జువేరియా 9.45, పాల్గుణ 9.35, అయిషా 9.25, రెండో సెమిస్టర్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో గురుపల్లవి 9.25, భాగ్యశ్రీ 9.17, బీకాం కంప్యూటర్స్ విభాగంలో కరిష్మా 9.42, కుందన 9.08 జీపీఏ సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, కరస్పాండెంట్ వీరరాఘవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

విద్యుత్ బకాయిలు చెల్లించండి

మైదుకూరు : మైదుకూరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని వినియోగదారులు తమ విద్యుత్ బకాయిలను చెల్లించాలని ట్రాన్స్‌కో డీఈఈ శ్రీకాంత్ కోరారు. మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలాల్లో ఆదివారం కూడా తమ సిబ్బంది సాధారణ రోజులలాగే ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ బిల్లులు తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు గమనించి తమ సర్వీసు మీద ఉన్న బకాయిలను చెల్లించి సహకరించాలని కోరారు. గ్రామీణ ప్రాంత వినియోగదారులు, ఎస్సీ, ఎస్టీ కాలనీలలో ఉంటూ బకాయిలు ఉన్న వారు ఎటువంటి ఆలస్యం లేకుండా బిల్లులు చెల్లించి అపరాధ రుసుం నుండి ఉపశమనం పొందాలని సూచించారు.

గురుకుల పాఠశాలను తరలిస్తే ఉద్యమిస్తాం



ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : బద్వేలు నియోజకవర్గంలోని సగిలేరు గురుకుల పాఠశాలను తరలిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. గురుకుల పాఠశాల తరలింపును ఆపాలని కోరుతూ శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని బి.కోడూరు మండలం సగిలేరు వద్ద 1983లో బాలుర గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇక్కడ ప్రతి ఏటా 600 మందికిపైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తుంటారని, అలాంటి పాఠశాలను ఏకపక్షంగా తరలించాలనుకోవడం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమేనని అన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కొనసాగించాలని, లేనిపక్షంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఏకంచేసి విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు మస్తాన్‌షరీఫ్, రూరల్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే సగిలేరు గురుకుల పాఠశాలను బి.మఠం మండలంలోని తోట్లపల్లెలోని మహాగురుకులంలోకి తరలించాలనుకోవడం సరికాదని పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.పిచ్చయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి పి.వెంకటరమణ, సీనియర్ దళిత నాయకుడు బి.కేశవయ్య పేర్కొన్నారు.

నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఏడీఏ కృష్ణమూర్తి

మైదుకూరు : రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అమ్మితే కఠిన చర్యలు తప్పవని మైదుకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు కృష్ణమూర్తి హెచ్చరించారు. మైదుకూరులో శనివారం విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు నగదు బిల్లులను ఇవ్వాలని సూచించారు. కాలం చెల్లిన మందులను, విత్తనాలను దుకాణాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఉంచరాదన్నారు. ప్రతి రోజు స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలను అప్డేట్ చేసి ఉంచాలని తెలిపారు. ధరల పట్టిక, స్టాక్‌బోర్డు అప్డేట్ చేయాలని సూచించారు. అనుమతి లేని వాటిని రైతులకు విక్రయించినా, అధిక ధరలకు అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిషేధించిన పురుగు మందులు విక్రయించరాదని తెలిపారు. లైసెన్స్‌లు లేకుండా గ్రామాల్లో ఎవరైనా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి బాలగంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలి



బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ డీఈఓ మీనాక్షి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని డిప్యూటీ డీఈఓ మీనాక్షి తెలిపారు. స్థానిక శ్రీరమణ మహర్షి ఎయిడెడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో 1985–86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు ఒక్కొక్కరికీ రూ.10వేల ప్రోత్సాహక బహుమతులు శనివారం అందజేశారు. 6 నుంచి 9వ తరగతి వరకు ఎఫ్ఏ, ఎస్ఏలలో ప్రతిభ చూపిన వారికి స్కాలర్ షిప్ పంపిణీ చేశారు. రూ.15 వేల విలువ చేసే ఆటవస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓమాట్లాడుతూ పాఠశాల పురోభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఎంఈఓలు సావిత్రమ్మ, శోభారాణి మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యార్థులు చదివి ఉన్నత భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 వంశీ కృష్ణ, విశ్వనాథ్, రామ్‌సాయిగుప్తాప్రభు, లక్ష్మీకాంత్‌రెడ్డి, రవిప్రకాష్, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు



బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సత్కరించిన తోటి ఉపాధ్యాయులు

బద్వేలు అర్బన్ : ఉపాధ్యాయులు విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినప్పుడే వారికి సమాజంలో గుర్తింపు లభిస్తుందని చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంజిపెంచలయ్య తెలిపారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో పాఠశాల నుండి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శనివారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, దానిని సక్రమంగా నిర్వర్తించినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. పదవ తరగతి ఫలితాల సాధనలో వరుసగా పదిసార్లు 100 శాతం ఫలితాలను సాధించిన ఘనత చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సొంతమన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు టి.పెంచలయ్య, టి.వి.సుబ్బారావు, మాదనవిజయకుమార్, ఎస్.వరలక్ష్మిలను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మైదుకూరు : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర నాయకుడు కేసీ లక్ష్మయ్య మాదిగ వర్ధంతి సందర్భంగా శనివారం మండలంలోని కరుణగిరి ఆర్‌సీఎం పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మార్పీఎస్ నాయకులు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. అంతకుముందు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ నాయకులు లక్ష్మయ్య కుటుంబ సభ్యులతో కలసి ఆయన నివాళి అర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆయిల్ విభాగం అధికారి ఎం.లక్ష్మయ్య, పాఠశాల హెచ్ఎం సుబ్బారావు, ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకుడు రామసుబ్బయ్య మాదిగ, పాస్టర్ మనోహర్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయం పాటించాలి

మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి



బద్వేలు అర్బన్ : ఆయా శాఖల అధికారులు పార్టీలకతీతంగా సమన్వయం పాటించి నిబంధనల మేరకు నడుచుకోవాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో వివిధ హౌసింగ్ లే అవుట్లలో పక్కా గృహాలు మంజూరైన 1081 మంది లబ్ధిదారులకు అనుబంధ పత్రాలు మంజూరు చేయకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే బద్వేలు, గోపవరం మండలాల తహసీల్దార్లు స్పందించి లబ్ధిదారులకు అనుబంధ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. దీనికి స్పందిస్తూ బద్వేలు, గోపవరం మండలాల తహసీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి మాట్లాడుతూ బద్వేలులో అధికంగా నకిలీ పట్టాలు తయారవుతున్న నేపథ్యంలో ఇకపై మంజూరు చేసే డీకేటీ పట్టాలు, అనుబంధ పత్రాలు క్యూఆర్‌కోడ్‌తో మంజూరు చేయనున్నామని, అందుకే ఆలస్యమైందని, వీలైనంత త్వరగా అనుబంధ పత్రాలు మంజూరు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో బద్వేలు మున్సిపాలిటీకి నూతన కార్యాలయం, పురపాలక సంఘం ఆధ్వర్యంలో పెట్రోలు బంకు, మూడు అర్బన్ హెల్త్ సెంటర్లు, పెద్ద ఎత్తున ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, అంత అభివృద్ధి జరిగినప్పటికీ ఏవో కొన్ని చిన్న తప్పులను చూపుతూ అసత్య ప్రచారాలు చేయడం తగదని, అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పట్టణ పరిధిలో పన్ను విధింపు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా ఉందని, అన్ని ప్రాంతాల్లో ఒకే రకంగా పన్నులు ఉండేలా చూడటంతో పాటు పన్నులు తగ్గించాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి సమావేశం దృష్టికి తీసుకురాగా ఆయా ప్రాంతాల ధరలను రిజిస్ట్రేషన్‌శాఖ నిర్ణయిస్తుందని, ఆ మేరకే పన్నులు విధించడం జరుగుతుందని మున్సిపల్ అధికారులు సమాధానమిచ్చారు. పురపాలక సర్వసభ్య సమావేశాలకు గతంలో ఎన్నడూలేని విధంగా పోలీసు బందోబస్తు నిర్వహించడం ద్వారా ప్రజలకు వేరే సంకేతాలు వెళతాయని, కౌన్సిలర్లందరము పురపాలకలో చేపట్టే అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరిస్తామని, ఇకపై జరిగే సమావేశాలకు పోలీసు బందోబస్తు లేకుండా చూడాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అలాగే నెల్లూరు రోడ్డులోని హిందూ శ్మశానవాటికలో రోజురోజుకు చెత్త వ్యర్థాలు వేయడం అధికమవుతుందని, ఇదే అంశంపై గతంలో అనేక సార్లు ఫిర్యాదు చేసినా స్పందించేవారే కరువయ్యారని కో ఆప్షన్ సభ్యుడు రామచంద్రారెడ్డి సమావేశం దృష్టికి తీసుకురాగా వ్యర్థాలు వేయకుండా తక్షణమే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, డీఈ సుమన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి

గోపవరం : తెలుగు రామాయణ తొలి మహాకవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని మొల్ల సాహితీపీఠం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం సాహితీపీఠం ఆధ్వర్యంలో తహసీల్దారు త్రిభువన్‌రెడ్డికి వినతి పత్రం అందజేసి ఆయనను సన్మానించారు. విగ్రహ ఏర్పాటుకు తహసీల్దారు సానుకూలంగా స్పందించారని మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ గానుగపెంటహనుమంతరావు తెలిపారు. బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, తహసీల్దారు త్రిభువన్‌రెడ్డిలకు సాహితీపీఠం సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మొల్ల సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్, మహిళా కార్యదర్శి నాగసుధ, కార్యవర్గ సభ్యుడు నరసింహులు తదితరులు ఉన్నారు.

ఫార్మసీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నిబంధనలు పాటించని ఫార్మసీ, బీఎస్సీ, ఎంఎల్‌టి, బిపిటి, ఫార్మా–డి, బీఫార్మసీ, డిప్లొమా ఫార్మసీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు కోరారు. డీఎంహెచ్ఓ నాగరాజును శనివారం ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులతో తరగతులు బోధిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలరూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రొద్దుటూరులోని లక్ష్మీ వెంకటేశ్వర, శ్రీనివాస ఫార్మసీ కళాశాలలో సీనియర్ విద్యార్థులతో తరగతులు బోధిస్తున్నారని ఆరోపించారు. వంద పడక గదుల ఆస్పత్రిలో ప్రాక్టీస్ ఇప్పించకుండా కరపత్రాలు కొట్టించి ప్రచారం చేసుకుంటున్నారన్నారు. హెల్త్‌యూనివర్సిటీ అధికారులు విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, అఖిరానందన్, మస్తాన్, చాంద్‌బాషా, పాల్గొన్నారు.

టీ దుకాణంలో చోరీ

ప్రొద్దుటూరు క్రైం: మండలంలోని కానపల్లెకు చెందిన శ్రీపతి మనోహర్ గంగమ్మ దేవాలయం వీధిలో తాజ్ కేఫ్ టీ స్టాల్ నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం దుకాణం తెరిచేందుకు రాగా తాళం పగులకొట్టబడి ఉంది. మనోహర్ లోపలికి వెళ్లి చూడగా క్యాష్ కౌంటర్‌లోని రూ.1.80 లక్షల నగదు, సెల్ ఫోన్లు, సిగరేట్ పెట్టెలు కనిపించలేదు. దీంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో మహిళ మృతి

కాశినాయన: మండలంలోని కొత్తఉప్పలూరుకు చెందిన దారిబోయిన రంగమ్మ (55) పాముకాటుతో మృతి చెందింది. బంధువులు వివరాల మేరకు.. రెండు రోజుల కిందట చెట్టు కింద కూర్చొని ఉండగా రంగమ్మను పాము కాటేసిందని, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం




మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి

ప్రొద్దుటూరు రూరల్ : చిరుధాన్యాలతో చేసిన వంటలను తినడం వల్ల ఆరోగ్యం చేకూరుతుందని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఏరువాక కోఆర్డినేటర్ డాక్టర్ అంకయ్య కుమార్ తెలిపారు. మండలంలోని తాళ్లమాపురం గ్రామ పంచాయతీ మూలవారిపల్లె గ్రామంలో శనివారం ఎస్సీ, ఎస్టీ మహిళలకు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చిరుధాన్యాల వినియోగంపై ప్రోత్సహించేందుకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. చిరుధాన్యాల వినియోగం, ఉపాధి కల్పన వైపు ప్రజలను ప్రోత్సహించడమే ప్రధాన ఉద్దేశమన్నారు. చిరుధాన్యాల పంటలు ఏ సీజన్‌లో అయినా పండించవచ్చని పేర్కొన్నారు. ఈ పంటలకు నీటి అవసరం చాలా తక్కువని, వర్షాధార పంటలుగా పండించవచ్చన్నారు. చిరుధాన్యాల సాగులో పురుగు, తెగులు చాలా తక్కువ అన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి చిరుధాన్యాలు రకాలు, ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. పేగు ఆరోగ్యానికి, రక్తపోటును తగ్గించడానికి, డయాబెటీస్, ఎముకల ఆరోగ్యానికి చిరుధాన్యాలు దోహదపడుతాయని తెలిపారు. చిరుధాన్యాలతో వంటకాల తయారీ గురించి ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. అనంతరం జొన్నలు, కొర్రలు, రాగితో తయారు చేసిన బిస్కెట్లు, స్వీట్లను మహిళలతో తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీ ఓబులేసు, యానిమేటర్ మేరి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను తరలించవద్దు

పోరుమామిళ్ల : సగిలేరు గురుకుల పాఠశాలను బి.మఠం మండలంలోని తోట్లపల్లె మహా గురుకుల పాఠశాలకు తరలించడం తరలించవద్దని వైఎస్సార్ సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి ఆదిత్యారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం రాత్రి ఆయన మాట్లాడుతూ సగిలేరు గురుకుల పాఠశాలలో కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు మండలాల విద్యార్థులు ఉన్నారని, అక్కడ చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. విద్యార్థుల ప్రయాణ సమస్య, భద్రత, మౌళిక సదుపాయాలు పరిగణలోకి తీసుకోకుండా వారి భవిష్యత్తును ఖతం చేసే విధంగా నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. మఠం మహా గురుకుల పాఠశాలలో ఇప్పటికే 500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, సగిలేరు విద్యార్థులకు కలిపితే మొత్తం 900 మందికి పైగా అవుతారన్నారు. అక్కడ మౌళిక సదుపాయాలు సరిపోవన్నారు. 14 తరగతి గదులు, 20 బాత్‌రూములు ఉండటం విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. వెంటనే తరలింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఉన్నత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదిత్యారెడ్డి కోరారు. అలాగే ప్రజాసంఘాల ఐక్య వేదిక కన్వీనర్ ఈశ్వరయ్య, సీపీఐ నాయకులు రవికుమార్, మస్తాన్, సీపీయం నాయకుడు భైరవప్రసాద్, దళితవేదిక రాష్ట్ర నాయకుడు యోహాన్, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఓబులేసు, ఎమ్మార్పీఎస్ నాయకులు మనోజ్, తదితరులు సగిలేరు గురుకులాన్ని రక్షించుకోవడం నియోజకవర్గ ప్రజల ఆత్మ గౌరవమన్నారు.

అవస్థలకు తోడు.. రోలర్ ఇలా



రోడ్డుకు అడ్డుగా ఉంచిన రోడ్డు రోలర్

మైదుకూరు – తాడిచెర్ల రహదారి విస్తరణ పనులతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. రోడ్డుకు ఒక వైపు విస్తరణ కోసం కంకర మట్టి పరిచి పెట్టారు. ఇంకొక వైపున ఉన్న పాత రోడ్డు మీదే వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. ఇరుకుగా మారిన రోడ్డుపై వాహనాల రాకపోకలు ఎంతో ప్రమాదకర పరిస్థితుల్లో సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కూడా రోడ్డు పనులు నిర్వహిస్తున్న వారు రోడ్డును పటిష్టపరిచే ఓ రోడ్డు రోలర్‌ను రోడ్డుకు అడ్డంగా పెట్టి వెళ్లారు. ఇది వాహనాల రాకపోకలకు మరింత అడ్డంకిలా మారింది.

– మైదుకూరు